1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఏప్రిల్ 12, 2025 | www.navatelangana.com

గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ ధరలు తగ్గించకపోతే ప్రజలు ఎదురు తిరుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, ఏరియా కమిటీ సభ్యులు చల్లూరి దేవదాస్, నాయకులు గుమాస లక్ష్మణ్, దుర్గం బాపు, చాపిడి నారాయణ, గుమాస శంకర్, ప్రసాద్, కిష్టయ్య పాల్గొన్నారు.



ఒకే చెట్టు..రెండు రకాల పువ్వులు

నవతెలంగాణ-మందమర్రి

ఒకే చెట్టుకు రెండు రకాల మందార పువ్వులు పూస్తూ అందరినీ ఆకట్టుకుంటోంది. మందమర్రి మార్కెట్ ప్రాంతంలోని గణేష్ సూపర్ మార్కెట్ యజమాని ఇంట్లో కొన్నేళ్లుగా గంధం రంగు పువ్వుల మందార చెట్టును పెంచుతున్నాడు. ఎల్లప్పుడూ ఈ చెట్టుకు గంధం రంగు పూలు మాత్రమే పూసేవి. కానీ ఇటీవల అదే చెట్టుకు ఎర్ర మందారాలు కూడా పూయడం ఆశ్చర్యంగా ఉందని గణేష్ తెలిపారు. ఒకే కొమ్మకు పక్కపక్కనే రెండు రంగుల పువ్వులు పూయడంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం తప్పదు



నవతెలంగాణ-భైంసా

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్తారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం బాసర ట్రిపుల్ ఐటీ ముందు తమను రెగ్యులరైజ్ చేయాలని ధర్నా చేస్తున్న కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 21తో సంవత్సరాల తరబడి పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. తక్షణమే జీఓను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. రాష్ట్రంలో 13 యూనివర్సిటీలో 900 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారని, అందులో 200 మంది మహిళా ప్రొఫెసర్లు ఉన్నారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని ముఖ్యమంత్రి వద్దకు వెళితే, వారందరినీ అరెస్ట్ చేసి 13 పోలీస్‌స్టేషన్లో దినమంతా నిర్బంధించడం ఏంటని మండిపడ్డారు. ఎన్నికల్లో రెగ్యులరైజ్ చేస్తానని, ప్రొఫెసర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాట తప్పడం సరికాదన్నారు. ఇచ్చిన వాగ్దానం మేరకు వారిని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో జొన్న, మొక్కజొన్న పంట దగ్ధం

నవతెలంగాణ-సిరికొండ



షార్ట్ సర్క్యూట్‌తో జొన్న, మొక్కజొన్న పంట, పైపులు దగ్ధమయ్యాయి. రైతులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలో పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్గి రవ్వలు ఎగిసిపడ్డాయి. మండల కేంద్రానికి చెందిన సాయిని స్వామికి చెందిన రెండు ఎకరాల పొలంలో జొన్న పంట, 30 పైపులు, సాయిని భూమారెడ్డికి చెందిన మొక్కజొన్న పంట, చంపత్‌రావ్‌కు చెందిన మొక్క జొన్న పంట మొత్తం కాలిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. దాదాపుగా మూడు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడంతో గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా కొంత ప్రమాదాన్ని ఆపగలిగారు. ఆర్థికంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా సంఘటన వద్దకు వెళ్లి పరిశీలించి, పంచనామా నిర్వహిస్తామని తెలిపారు.

రాజీవ్ రహదారిపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల వేగాన్ని పూర్తిగా తగ్గించేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల రెండు వాహనాలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఇక్కడ ప్రమాదాలను అరికట్టడం కోసం శుక్రవారం ఎస్సై శ్రీధర్‌తో కలిసి శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ రాజీవ్ రహదారితో పాటు జాతీయ రహదారి నెం.63పై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. వాహనాల వేగాన్ని నియంత్రించడం కోసం ఇటీవల బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు, రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ఈ మార్గంలో వచ్చే వాహనాల స్పీడును పూర్తిగా నియంత్రిచడం కోసం కృషి చేస్తున్నారు. ఇదివరకే ఇక్కడ సోలార్ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించగా ప్రస్తుతం బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను పూర్తిగా నియంత్రించాలని భావిస్తున్నారు.

పోక్సో కోర్టు పీపీగా ప్రవీణ్ నియామకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది బి.ప్రవీణ్ కుమార్ పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవి గుప్తా జీఓ ఆర్ టి నంబర్ 302తో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు సాంబశివరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఈయనకు ఉత్తర్వులు అందజేశారు. ఈయన ఇంతకుముందు 2008లో జిల్లా మొదటి అదనపు కోర్టులో వరుసగా రెండు మార్లు అదనపు పీపీగా పనిచేశారు. పదవీ కాలం మూడేళ్ల పాటు ఉంటుంది.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని వాయిపేట్ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమల అన్నారు. శుక్రవారం మండలంలోని రాజంపేట్ గ్రామంలో పోషక ఆహార లోపంపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందించే గుడ్లు, పాలు, పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోషక ఆహార లోపంతో అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా గర్భిణులు పౌష్టిక ఆహారాన్ని తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్త, మహిళలు పాల్గొన్నారు.

వంటింటి ఆహార ధాన్యాలతో అనుబంధ వంటకాలు

నవతెలంగాణ-జైపూర్

అదనంగా ఖర్చు చేయకుండా రోజు వినియోగించుకునే ఆహార ధాన్యాలతో అనుబంధంగా పౌష్టిక ఆహార వంటకాలు తయారు చేసుకోవచ్చని అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి, సునిత తెలిపారు. పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టేకుమట్ల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులతో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను ఉపయోగించి అనుబంధ ఆహార వంటకాలను తయారు చేయడంపై ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణి, పిల్లల తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్లను శుక్రవారం బీఆర్ఎస్ మండల కన్వీనర్ బిట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న జరిగే రజతోత్సవ బహిరంగ సభకు కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు వాసాల రాజవర్దన్, తైదల రవి, పొట్టె గంగారాం, పాగిడి దేవదాస్, పున్నం తోగాయ, తొడసం సుధాకర్, సిడాం సురేష్ పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు జ్యోతిబాఫూలే

● పలుచోట్ల ఘనంగా జయంతి వేడుకలు



ఆదిలాబాద్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పూలే జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మ జ్యోతిబాపూలే జీవితాంతం సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి అన్నారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకుని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా, అందరూ సమానులే అని సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతులకు వివాహాలు చేయడానికి పని చేశారన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, ఎస్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి అరిఫా బేగం, కెవిపిఎస్ నాయకుడు ఆర్.ప్రవీణ్, సభ్యులు రాధ, గంగాసాగర్, మమత, ప్రభు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ అతిక్ బేగం పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే దేశంలోని సామాజిక సంస్కర్త, కార్యకర్త, రచయిత అన్నారు. కుల ఆధారిత వివక్షను నిర్మూలించి, అణగారిన వర్గాలను ఉద్ధరించడానికి ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు యాకోబలి, పృథ్వీరాజ్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ చంద్రకాంత్, కరుణాకర్, రేఖ, అనిత, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాల : దేశంలోని మెజారిటీ వర్గాల వెనుకబాటుకు కారణమైన కుల దురహంకార దౌర్జన్యాలను 170 యేళ్ల క్రితమే ఎదిరించిన ధీశాలి మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు అందరూ పాటు పడాలని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో జరిగిన 198వ పూలే జయంతి వేడుకలలో పాల్గొని మాట్లాడారు. తన 'గులాంగిరీ' పుస్తకం ద్వారా కులవ్యవస్థలోని లోపాలను వివరించాడని పేర్కొన్నారు. 'సత్యశోధక్ సమాజ్' సంస్థను స్థాపించి మెజారిటీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించడానికి నడుం కట్టిన మహాత్ముడని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు పూలే గొప్పతనం గురించి, ఆయన చేసిన త్యాగాల గురించి, సామాజిక న్యాయ ఆవశ్యకత గురించి ప్రచారం చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి కన్వీనర్ మోతె రామదాసు, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కోఆర్డినేటర్ చలమల్ల అంజయ్య, సామాజిక ఉద్యమకారుడు కామిల్ల జయరాజు, సింగరేణి రిటైర్డు కార్మిక సంఘం నాయకులు పద్దపల్లి కోటిలింగం, సమ్ము రాజన్న, మానవ వికాస వేదిక నాయకులు పత్తి సత్తయ్య, మాడిశెట్టి విశ్వం, రమేష్ బాబు, తిరుపతిరెడ్డి, చంద్రమౌళి, కైలాసం, రాజు, చారి, వేముల అశోక్, అడిచర్ల రాజేశం, గౌరయ్య, ప్రశాంత్, వెంకటేష్, మహేందర్, రాములు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

మనువాదంపై పోరాటాలు చేయడమే నేడు జ్యోతిరావుపూలేకు అర్పించే నిజమైన నివాళి అని, మహనీయుల మాసమైన ఏప్రిల్ నెలలో కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతి ఘటన పోరాటాలు నిర్వహించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి దూర్కే మోహన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహంలో మహాత్మ జ్యోతిరావుపూలే 199 జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కుల వివక్ష, అంటరానితనం మన దేశంలోనే ఉందని, వేల సంవత్సరాలుగా కులం పేరుతో ఆధిపత్యం చేస్తూ సామాజిక, ఆర్థిక దోపిడీ కొనసాగిన దానికి వ్యతిరేకంగా తమ జీవితాంతం పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారులు పూలే దంపతులను కొనియాడారు. నేడు దేశాన్ని పాలిస్తున్న బీజేపీ నాయకులు పచ్చి మతోన్మాద అవకాశవాద రాజకీయాలను నడుపుతూ దేశంలో మతాలను రెచ్చగొడుతూ మరల పాతకాలపు నీచమైన రాచరిక వ్యవస్థలోకి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాజేశం, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రామ్‌దాస్, మేడిపల్లి రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ్‌కుమార్, నాయకులు దుర్గం రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన చేసిన అవిశ్రాంత పోరాటం, మహిళా విద్య, సాధికారత కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని తెలిపారు.



మంచిర్యాల : బీసీ సంఘాల ఆధ్వర్యంలో..



మంచిర్యాల : కేవీపీఎస్ ఆధ్వర్యంలో..



నిర్మల్‌టౌన్ : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

అడవిలో తప్పిపోయిన మహిళలను కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

తునికాకు సేకరణకు అడవికి వెళ్లి తప్పిపోయిన మహిళలను ఎస్పీ జానకి షర్మిల చొరవతో పోలీసులు కాపాడారు. మామడ మండలం కప్పనపల్లి గ్రామానికి చెందిన నలుగురు మహిళలు రాజుల రాధ(35), కంబాల లింగవ్వ(36), గట్లమీది లక్ష్మి(40), బత్తుల సరోజ(40) గురువారం గ్రామ సరిహద్దులో గల దట్టమైన అటవీ ప్రాంతంలోకి గురువారం సాయంత్రం వెళ్లారు. తునికాకు తెంపుతూ దారి తప్పారు. విషయం తెలుసుకున్న ఎస్పీ డా.జానకి షర్మిల స్వయంగా ఏఎస్పీ రాజేష్ మీనాతో కలిసి మూడు స్పెషల్ పార్టీ బృందాలతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీస్ అధునాతన సాంకేతికతతో డ్రోన్‌లు ఉపయోగించి నలుగురు మహిళలను భీమన్న గుట్టపై గుర్తించి వారిని సురక్షితంగా గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామస్తులు ఎస్పీతో పాటు పోలీస్ బృందాన్ని పూలతో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితులు ఎప్పుడెదురైన పోలీస్ అక్కలా మీకు రక్షణగా ఉంటానన్నారు. అటవీ ప్రాంతాలకు వెళ్లే వారికి తగు జాగ్రత్తలు చెప్పారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఏఎస్పీ రాజేష్ మీనా, ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి, ఆర్ఐలు శేఖర్, రమేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలను అభినందించారు. టీంలో పాల్గొని ఉదయం నుండి వెతికి పట్టుకున్న స్పెషల్ పార్టీ, స్పెషల్ పార్టీ మహిళా పోలీసు బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



ఐకే-1ఎ గని సేఫ్టీ కమిటీ సమావేశం బహిష్కరణ



నవతెలంగాణ-జైపూర్

గతంలో లేవనెత్తిన సమస్యలు పరిష్కరించకుండా మరోసారి సేఫ్టీ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం ఎందుకని ఇందారం-1ఎ గని సేఫ్టీ కమిటీ ప్రశ్నించింది. శుక్రవారం నిర్వహించ తలపెట్టిన సేఫ్టీ కమిటీ సమావేశాన్ని పిట్ సేఫ్టీ కమిటీ బహిష్కరించడంతో పాటు సమస్యల పరిష్కారం విషయమై మరోమారు వినతిపత్రాన్ని అందజేసింది. సేఫ్టీ కమిటీలో గుర్తించిన సేఫ్టీ వైలెషన్లు పూర్తి చేయడంలో జాప్యం చేస్తూ ఫాలోప్ కమిటీ గుర్తించిన విషయాలను అమల్లోకి తీసుకురావాల్సిన అవసరముందని నాయకులు తెలిపారు. సెఫ్టీ కమిటీ సభ్యులు సూచించిన సేఫ్టీ సూచనలను అమలు చేయకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తూ సేఫ్టీ ఆఫీసర్‌తో పాటు మరి కొందరు అధికారులు, సూపర్‌వైజర్లు సేఫ్టీ సూచనలను ఉద్యోగులకు వక్రీకరిస్తూ చెప్పడం మానుకోవాలని తెలిపారు. పని ప్రదేశాలలో అందుబాటులో పని ముట్లు ఉంచాల్సిన అవసరమని, గనిలో ఏదైన అనుకోని ప్రమాదం జరిగినప్పుడు యాజమాన్యం ప్రమాద స్థలానికి వెళ్లి జరిపే ఎంక్వైరీ కమిటిలో సేఫ్టీ కమిటి సభ్యున్ని కూడా భాగస్వామిని చేయాలని డిమాండ్ చేశారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ కార్మికులను సస్పెండ్ చేయడం, చార్జీషీట్లు ఇవ్వడానికి నిరసనగా సేఫ్టీ కమిటీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని తెలుపుతూ గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి చింతల నవీన్‌రెడ్డి, సత్తయ్య, వెంకటస్వామి, రాజగోపాల్, ప్రశాంత్ రమేష్, నవీన్, శేఖర్, సంపత్, యూసఫ్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన మాజీ మంత్రి అల్లోల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా వరి ధాన్యం కొలుగోలు గురించి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దనసరి అనసూయ(సీతక్క)తో పాటు ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని గురువారం రాత్రి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు, సభ్యులు కలిసి విన్నవించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుండి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం వల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతమై రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, సకాలంలో రుణాలు అందించడం జరిగిందని తెలిపారు. కానీ ఈ యాసంగిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం నుండి ఇప్పటివరకు అనుమతి రాలేదన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయకపోతే సంస్థలు ఆర్థికంగా నష్టపోయి సిబ్బందికి కనీసం వేతనాలు అందించలేని స్థితికి దిగజారి పోతాయని పేర్కొన్నారు. వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మంత్రులను కోరారు. కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, రమణారెడ్డి, పద్మాకర్ రావు, గజ్జరాం, ప్రసాద్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, సారంగాపూర్ మాజీ జెడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ధర్మాజి రాజేందర్, జిల్లా ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



ప్రజలకు వైద్యంతో పాటు అవగాహన కల్పించాలి



ఆదిలాబాద్‌టౌన్ : వేసవిలో వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై ఆయా పీహెచ్‌సీలో వైద్యం అందించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన వేసవి రుగ్మతలపై వైద్యాధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి అబ్దుల్ వసే వైద్యులకు ఈ విషయమై అవగాహన కల్పించారు. అదే విధంగా ఎన్సీడీ కార్యక్రమాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎహెచ్ఓ మాట్లాడుతూ ఎన్సీడీ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే స్క్రీనింగ్ కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 సంవత్సరాలు పైబడిన వారు 3.60లక్షల మంది ఉన్నారన్నారు. వీరిలో డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు 15వేలు, హైపర్ టెన్షన్‌తో 31వేల మంది ఉన్నారని గుర్తించడం జరిగిందన్నారు. వీరికి స్క్రీనింగ్ కొనసాగుతుందని, ఇప్పటి వరకు 87 శాతం పూర్తి అయిందని, మరో 15 రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని సూచించామని పేర్కొన్నారు. జిల్లాలో ఏప్రిల్ ప్రారంభంలోనే 42డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలపై వైద్యులకు తెలియజేశారు. పీహెచీసీలతో పాటు రిమ్స్‌లో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్సీడీ అధికారి డాక్టర్ శ్రీధర్, క్షయ నివారణ అధకారి సుమలత, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పూర్తి పరిపక్వత చెందిన తర్వాతే కోతలు మొదలుపెట్టాలి

నతెలంగాణ-జైపూర్

యాసంగిలో వరి పంటలు సాగు చేసిన రైతులు పూర్తి స్థాయిలో పరిపక్వత చెందిన తర్వాతనే కోతలు మొదలు పెట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో అధికారులు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. వరి గింజ పూర్తిగా పసుపు పచ్చ రంగులోకి వచ్చిన తర్వాతనే వరి కోతలు చేపట్టాలని, హార్వేస్టర్ బ్లోయర్ 18-20 ఆర్‌పీఎం ఉండేలా చూసుకుంటే తాలు రాకుండా నాణ్యమైన గింజలు పొందవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు తరలించే ధాన్యం నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారి అనుమతిని అనుసరించి క్రమ పద్ధతిలో రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఓపీఎంఎస్ సైట్‌లో రైతుల పంట వివరాలు సరిపోల్చి చూసుకోవాలని తెలిపారు. అనంతరం ధాన్యం తూకం వేసి వెనువెంటనే ట్రక్ షీట్ ద్వారా మిల్లుకు పంపిచాలని, అదేవిధంగా రైతుకు ధాన్యం కొనుగోలు చేసినట్లు రశీదు ఇవ్వడమే కాకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తాగు నీరు, చలువ పందిళ్లు, ధాన్యం కోసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా రైతుకు సంబంధించిన భూమి పట్టాదార్ పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు బుక్కు జిరాక్స్ కాపీలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2320, బి గ్రేడ్ రూ.2300 చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. సమావేశంలో తహసీల్దార్, వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | ఏప్రిల్ 12, 2025 | www.navatelangana.com

పలు ఆస్పత్రులను తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ చట్టరీత్యా నేరమని, ఈ చట్టాన్ని బలోపేతంగా అమలు చేయడంలో భాగంగా జిల్లాలో ప్రత్యేక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టింది. శుక్రవారం జిల్లాలోని రెండు స్కానింగ్ సెంటర్లను పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. అలాగే అగ్నిమాపక



పరికరాల పనితీరును పరిశీలించారు. గజానన్ మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి, మమత నర్సింగ్ హోమ్‌లో తనిఖీ చేపట్టినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.సాధన, ప్రత్యేక తనిఖీ బృందంలో డాక్టర్ క్రాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ గైనకాలజీ రిమ్స్, యశోద మిషన్ కోఆర్డినేటర్, వైష్ణవి, పోలీసు అధికారి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకున్న మాజీ మంత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అయ్యప్ప స్వామి జన్మోత్సవ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి జోగు రామన్న అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. శుక్రవారం చాంద బెల్లూరి గ్రామంలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హోమయజ్ఞలు నిర్వహించారు. అనంతరం రవీంద్రనగర్‌లోని నూతన అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వామి, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయల నిర్వాహకులు జోగు రామన్నను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తూ సనాతన హిందూ ధర్మ స్థాపనకు పాటుపడాలన్నారు. ఆధ్యాత్మికం ద్వారా శాంతి స్థాపన చేకూరుతుందని కొనియాడారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పాలిటెక్నిక్ రెడీ..

- 1980 నుండి బ్యాచ్‌లందరికీ ఆహ్వానం
- అడహక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తీపి జ్ఞాపకాలను, మధురమైన అనుభూతులను అన్నింటికీ నెమరవేసుకోవడానికి పాలిటెక్నిక్ కళాశాల వేదిక కానుంది. ఏకంగా 45 ఏండ్ల నుంచి ఇప్పటి వరకు చదివిన విద్యార్థులు, అధ్యాపకులను కలిసే సువర్ణావకాశం పాలిటెక్నిక్ కళాశాల కల్పిస్తుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో అల్యూమ్ని మీట్ నిర్వహిస్తున్నారు. కళాశాల స్థాపన నుంచి నేటి వరకు చదువుకున్న విద్యార్థులందరు కలిసేందుకు ఈ మీట్‌ను ఈనెల 12న శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటి కళాశాల జిల్లా కేంద్రంలోనే ఏర్పాటైంది. 1980 సంవత్సరంలో సివిల్, మెకానికల్, సీసీపీ బ్రాంచ్‌లతో కళాశాల ప్రారంభమైంది. మొదట వినాయకచౌక్‌లో ప్రభుత్వ భవనంలో ఈ కళాశాల ఉండేది. తర్వాత 1993లో సంవత్సరంలో కేఆర్కే కాలనీ రోడ్డులో ప్రభుత్వం సొంత భవన నిర్మాణం చేపట్టింది. కళాశాల ప్రారంభమైనప్పుడు ఉన్న మూడు బ్రాంచ్‌లతో పాటు 2008 సంవత్సరంలో ఈఈఈ బ్రాంచ్ అందుబాటులోకి వచ్చింది. 2023లో సీసీపీ బ్రాంచ్ తీసేసి దాని స్థానంలో సీఎస్‌సీ బ్రాంచ్‌ను అందుబాటులోకి తెచ్చారు. 1980 నుంచి 2024 వరకు దాదాపు 40కి పైగా బ్యాచ్‌లు పూర్తయ్యాయి. పాత కళాశాలలో ఉమ్మడి రాష్ట్రంలో ఈ కళాశాల ఒకటి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఏ బ్యాచ్ వాళ్లు కూడా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించలేదు. 44 ఏండ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా మొదటి అల్యూమ్ని మీట్‌ను నిర్వహించేందుకు కళాశాల యాజమాన్యం సిద్ధమైంది.

సోషల్ మీడియా ద్వారానే ఆహ్వానాలు...

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు అల్యూమ్ని మీట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 12న శనివారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పూర్వ విద్యార్థులతో కలిసి ఒక అడహక్ కమిటీని కూడా ఎన్నుకున్నారు. ఆ కమిటీ ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమం కొనసాగుతోంది. 40 బ్యాచులకు పైగా విద్యార్థులకు వాట్సప్ గ్రూపుల ద్వారా.. సోషల్ మీడియా ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారు. టీజీఎస్.బీటీఈటీ బోర్డు నుంచి కూడా అతిథులకు ఆహ్వానాన్ని అందించారు. 45 ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక చోట కలవడంతో కళాశాల ప్రాంగణమంతా సందడిగా మారబోతుంది. చదువుకున్న విద్యార్థులు.. చదువు చెప్పిన అధ్యాపకులు అల్యూమ్ని వేదికగా కలవబోతున్నారు. ఆ రోజు కోసం విద్యార్థులు అందరూ ఎదురుచూస్తున్నారు.

పూర్వ విద్యార్థులకు స్వాగతం

కళాశాల ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు పూర్వ విద్యార్థులను అల్యూమ్ని మొదటి మీట్ ద్వారా ఆహ్వానిస్తున్నాం. దీనికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఒక కమిటీ ఎన్నుకోని కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులందరికి కాల్స్ ద్వారా వాట్సప్ ద్వారా ఆహ్వానాన్ని చేరవేస్తున్నాం. 44 ఏండ్ల తర్వాత అందరూ కలిసే సువర్ణావకాశం. పాలిటెక్నిక్ చదువుకున్న విద్యార్థులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలి.



బండి రాంబాబు,
సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

అంగన్‌వాడీ ఆయాలకు ప్రమోషన్ కల్పించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అంగన్‌వాడీ ఆయాలుగా 5 సంవత్సరాల సీనియారిటీ ఉండి ఇంటర్ విద్యార్హత కలిగిన వారికి ప్రమోషన్స్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఆయాల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం ఐసీడీఎస్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఆయాలకు ప్రమోషన్ ఇవ్వకుండానే, ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి అంగన్‌వాడీ టీచర్స్‌కు ట్రాన్స్‌ఫర్స్ చేయడం సరైంది కాదన్నారు. ఖాళీగా ఉన్న ఆయాల పోస్టు వెంటనే భర్తీ చేయాలన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య, రమ్యశ్రీ, సత్యపాల, సరోజన, లావణ్య పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా ముస్లీం పర్సనల్ లా బోర్డు కన్వీనర్ ఎంఏ గౌస్ అన్నారు. వక్ఫ్ బిల్లు ఆమోదాన్ని నిరసిస్తూ కలెక్టర్ చౌరస్తాలోని ఖిజ్ర మసీదు ఎదుట ఆందోళన చేపట్టారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు, చేతికి నల్ల బ్యాడ్జిలను ధరించి కేంద్రం తీరును ఎండగట్టారు. రాజ్యాంగాన్ని లెక్క చేయకుండా కేంద్రం వక్ఫ్ బిల్లును ఆమోదించిందని అన్నారు. ఇదీ ముస్లీం మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు. కేంద్రం ఈ బిల్లును వెనక్కి తీసుకునేంత వరకు ఉద్యమాలు, పోరాటలు కొనసాగిస్తామన్నారు. ముస్లీం పర్సనల్ లా బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు, నిరసనలు చేపట్టి బిల్లును రద్దు చేసేంత వరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ ఖిజ్ర అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, ఉమ్మిద్ ఫౌండేషన్ అధ్యక్షుడు అబ్దుల అజీజ్, జమియతుల్ ఉల్మా ప్రతినిధులు మహిమూద్ మదని, అఫ్రోజ్ ఉన్నారు.

కార్మికులకు సౌకర్యాలతో కూడిన భవన నిర్మాణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికులకు అన్ని సౌకర్యాలతో వేదికను ఏర్పాటు చేయడంలో భాగంగా భవనాన్ని నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం ఆర్అండ్‌బీ వద్ద రూ.25లక్షలతో నిర్మించే లెబర్ భవన నిర్మాణానికి అధికారులు, నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను కార్మిక సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో భవన నిర్మాణంతో పాటు ఆయా రంగాల్లో పని చేసే కార్మికులు ఉన్నారన్నారు. వారికి అడ్డాలు ఉన్న అక్కడ సరైన వసతులు లేవన్నారు. వేదిక లేని కారణంగా రోడ్లపైనే ఉండటం, ఎలాంటి సౌకర్యాలు లేక సమస్యలను చర్చించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని గమనించి రూ.25లక్షలతో ఆర్అండ్ బి ముందు కార్మికులకు అన్ని వసతులతో సముదాయాన్ని నిర్మించనున్నామని తెలిపారు. కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజలింగు, బీజేపీ నాయకులు వేదవ్యాస్, మున్న, రఘుపతి, రవి, మేస్త్రీ సంఘం అధ్యక్షుడు బండారి పోశయ్య ఉన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం



నవతెలంగాణ-సారంగాపూర్

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దామని, రాజ్యాంగాన్ని రక్షించుకుందామని కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని యాకర పల్లె, గొడిసర గ్రామాల్లో కాంగ్రెస్ చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలని, ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, నాయకులు నవీన్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ఉట్ల రాజేశ్వర్, సత్యపాల్‌రెడ్డి, రమణ యాదవ్, సత్యం, భోజన్న, గణేష్, సురేందర్ పాల్గొన్నారు.

పెంబి : జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెంబి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దుర్గ భవాని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీలు తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అలాగే 2 యూనిట్లకు ఉచిత కరెంటు, రైతు భరోసా, రైతు బీమా, రేషన్ కార్డు ఉన్న అందరికి సన్నాబియ్యం ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెంబి, కడెం కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సుజాత, సురేఖ, జిల్లా ఉపాధ్యక్షురాలు గంగవ్వ ఉన్నారు.

ఉమ్‌డం రైల్వే స్టేషన్ సమీపంలో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉండం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం మంటలు చేల రేగినట్టు గ్రామస్తులు తెలిపారు. చుట్టుపక్కల రైతులు తమ పంట చేనులో గల చెత్త చెదారాన్ని తగులబెట్టగా గాలితో చుట్టుపక్కల వ్యాపించి, మంటలు అంటుకుంటూ రైల్వే స్టేషన్ సమీపానికి చేరడంతో రైల్వే సిబ్బంది గమనించి, వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పి వేసింది. రైల్వే స్టేషన్ అతి సమీపంలో మంటలు అంటుకున్నట్లయితే రైల్వే స్టేషన్ కొద్ది దూరంలో ఉన్న సిగ్నల్ వ్యవస్థకు సంబంధించిన తీగలు కాలిపోయి ఉంటే సమాచార లోపానికి అంతరాయం కలిగి ఉండేదని ఉండం గ్రామస్తులు తెలిపారు. రైల్వే సిబ్బంది ముందుగానే అప్రమత్తమై మంటలు ఆర్పి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రాత్రి అనవసరంగా బయట తిరిగితే చర్యలే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాత్రి సమయంలో అవసరం లేకుండా బయట తిరగడం, ముచ్చట్లు పెట్టడం లాంటివి చేస్తే చర్యలు తప్పవని డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం అర్ధరాత్రి పట్టణంలో ఆపరేషన్ చబుత్రలో భాగంగా పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. వన్ టౌన్, టూటౌన్ పరిధిలో అవసరంగా బయట ఉన్న యువకులను స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి సమయాల్లో బయట తిరొగ్గదని సూచించారు. పది గంటల తరువాత ఎవరైనా బయట కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి పట్టణంలో అవససరంగా, అకారణంగా తిరిగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎలాంటి కారణం లేకుండా ఇండ్ల బయట తిరిగే వారిపై ఇక నుంచి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రోడ్లు, గద్దెలు, హోటళ్ల ఎదుట, ప్రధాన కూడళ్ల వద్ద వీధుల్ల అనవసరంగా కూర్చొద్దని సూచించారు.



రాత్రి 10 గంటల 30 నిమిషాలకు అత్యావసర దుకాణాలు మినహా ఇతర దుకాణాలను మూసి వేయాలన్నారు. రాత్రి సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు ఆపరేషన్ చబుత్రను చేపట్టామన్నారు. రాత్రి సమయంలో ఎలాంటి పని లేకుండా బైక్ లపై తిరిగే వారిపై చట్ట పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఇందులో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సునీల్ కుమార్, కమలాకర్, పోలీసులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసాను విడుదల చేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భరత్ చౌహన్



నవతెలంగాణ-ఉట్నూర్

ఉపాధి హామీ కూలీలకు రూ.12వేల ఆర్థిక భరోసాను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భరత్ చౌహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్ శివారులో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులను భరత్ చౌహన పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు, రైతు కూలీలను మోసం చేసిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆరు వారాలు దాటినా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు అందలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. వంద రోజులు దాటిన ఉపాధి హామీ కూలీలకు గడ్డపార, తట్ట ఇతర సామాగ్రిలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల డబ్బులు వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో రైతు, రైతు కూలీలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వినోద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు భుజంగ్ రావ్, రషీద్‌ఖాన్, గంగన్న, దేవన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగయ్య ఎంపీపీ సంతోష్, వైస్ ఎంపీపీ లస్మన్న, సర్పంచ్ లింబాజీ, గంగయ్య, కల్చప్ యాదవ్, ప్రవీణ్, అఫ్రోజ్, ఎంపీటీసీ మహేందర్, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

చలో వరంగల్... పట్టణంలో వాల్ పెయింటింగ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా బీఆర్ఎస్ శ్రేణులు వారి ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో వాల్ పెయింటింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. సుభాష్ నగర్ అనుకుంట, కొలీపుర, పిట్టలవాడ, ఛలో వరంగల్ అంటూ వాల్ పెయింటింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కొండ గణేష్, దమ్మపాల్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనగా ఉద్యమాన్ని చేపట్టిన నాయకుడే తెలంగాణ ముఖ్యమంత్రిగా, తెలంగాణ ముందు తరాలకు భవిష్యత్ ప్రణాళికగా ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు అనేక కార్యచరణ చేయడం జరిగిందన్నారు. సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టుతున్నారని అన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రజల పక్షాన ముందుండి పోరాడుతుందనీ, ఏప్రిల్ 27న యావత్ తెలంగాణ ప్రజలు చలో వరంగల్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవిదాస్, మౌర్య సురేందర్, అన్నెల వసంత్, అనుకుంట అశోక్, ఉగ్గే విఠల్, వినోద్, మహేష్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉండం గ్రామానికి చెందిన ఆసర వెంకటి(26) భార్య కాపురానికి రావడం లేదని, మద్యానికి బానిసై మద్యం మత్తులో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు వెంకటి భార్యతో గొడవపడగా ఆమె గత రెండు నెలల కింద పాపను తీసుకుని నేరడిగొండ గ్రామానికి వెళ్లిపోయింది. మృతుడు గత రెండు నెలలుగా తెల్ల కల్లుతో పాటు ఇతర మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. కాగా మృతుడు తండ్రి శుక్రవారం కొడుకు ఇంటికి వెళ్లి చూడగా అప్పటికే ఇంట్లో ఉరివేసుకొని ఉండటంతో గ్రామస్తులకు పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య ఒక పాప ఉన్నట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు. ఈ మెరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పార్డి(బి) గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పార్డి(బి) గ్రామానికి చెందిన పోనికంటి సాయినాథ్(46) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కూతురు గత 15రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి మద్యం బానిసై గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో వెతికారు. కాగా మృతుడు కౌలు చేస్తున్న చేనులోని వేప చెట్టు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవీందర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-పెంబి

రైతులు ఒక చోట సమావేశమై సాగు సంబంధిత విషయాల గురించి చర్చించుకునే సదుద్దేశంతో మండల కేంద్రంలో నిర్మించిన రైతు వేదిక, మెయిన్ రోడ్డు నుంచి కాస్త దూరంగా పంట పొలాల మధ్యలో నిర్మించడంతో వర్షాకాలంలో రైతు వేదికను చేరుకోవడానికి ఇబ్బందులకు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో ఈజీఎస్ నుంచి సీసీ రోడ్డు మంజూరు చేశారు. కాగా శుక్రవారం రైతు వేదిక ముందు సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్టు ఏఈఓ రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
3
శనివారం | ఏప్రిల్ 12, 2025 | www.navatelangana.com

సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు



నవతెలంగాణ-కెరమెరి

సమయపాలన పాటించని ఉపాధ్యాయుల పై కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి ఆడె ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్మాపూర్, దేవాపూర్, చిత్తగూడ, జయరాంగూడ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న ఎస్ఏ 2 పరీక్షలలో భాగంగా తెలుగు పరీక్షను పరిశీలించారు. పాఠశాలల్లోని పలు రికార్డులను రిజిస్టర్‌లను పరిశీలించి రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఎంఈఓ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నిరంతర సాధనతో ఉత్తమ ఫలితాలు



నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థుల నిరంతర సాధనే పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పెడుతుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి పలు సూచనలు చేశారు. శ్రీరాంపూర్‌లోని పాల్ టెక్నిక్ కళాశాల రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి కొలువులు సాదించాలంటే పాల్‌టెక్నిక్ మంచి అవకాశమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, హెచ్‌ఎం రవితేజ, ఉపాధ్యాయులు ఆర్లరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగిద్దాం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన ప్రజల సంక్షేమం కోసం, స్త్రీ-పురుష సమానత్వం కోసం అంకిత భావంతో కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుకలకు నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మాలీ కుల సంఘాల నాయకులతో కలిసి మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, ఆసిఫాబాద్ మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావ్, కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, మాలీ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సెండే వాసు, నాగోసే శంకర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రూప్నర్ రమేష్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కేశవరావు, వివిధ కులాల సంఘాల నాయకులు పాల్గొన్నారు. మాలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ రోడ్డు వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు



రెబ్బెన : జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీఎం విజయభాస్కర్ రెడ్డి

వాంకిడి : మండల కేంద్రంలో నిర్వహించిన జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్నులే నారాయణ, మాలీ సంఘం నాయకులు మహోల్కర్ అశోక్, కోబ్రాగడే విలాస్, జాబిరె పెంటు, జైరామ్, బెండారె కృష్ణ, వడాయి జ్యోతిభ, యువకులు, మహిళలు పాల్గొన్నారు. జేత్వాన్ బుద్ధవిహార్‌లో నిర్వహించిన జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మొహల్కర్ మండలాధ్యక్షుడు, సీనియర్ బౌద్ధ ఉపాసకులు జయరాం ఉప్రే, సమాజ్ అధ్యక్షుడు విలాస్, రాజేంద్రప్రసాద్, బీఎస్ఐ జిల్లా ఆర్గనైజర్ విజయ్, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు హంసరాజ్, కార్యదర్శి ప్రతాప్, వర్షివాస్ కమిటీ అధ్యక్షులు ప్రశాంత్, నాయకులు రోషన్, శివాజీ, విట్టల్, నాగసెన్ రావు, దుర్గం శ్యామ్ లహుజీ , బౌద్ధ ఉపాసకులు పాండూజీ పాల్గొన్నారు.

కెరమెరి : మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో మాలీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు కావుడే తులసిరాం, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం, నాయకులు కొట్రంగే తిరుపతి, సెండే నారాయణ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జ్యోతిబాపూలే జయంతిని వేడుకలు నిర్వహించారు. ఇందులో మండల అధ్యక్షుడు గురునులే నానాజీ, ప్రధాన కార్యదర్శి వాడే రవి, కోశాధికారి చౌదరి నానాజీ, బాలాజీ, ఈశ్వర్, వెంకట్, గణపతి, చంద్రు, బాబురావు, లేండుగురే శంకర్ గ్రామస్థులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని డబ్బా, బారేగూడ గ్రామాల్లో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో మాలీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మోర్లే పోచయ్య గుర్లే శ్రీనివాస్, శంకర్, సుధాకర్, రామయ్య మాలి సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన : గోలేటిలోని జీఎం కార్యాలయం ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, బీసీ లైసన్ ఆఫీసర్ మధు కుమార్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఇన్‌చార్జి ఎస్ఓటుజీఎం ఉమాకాంత్, బీసీ, ఓబీసీ ఉద్యోగ సంఘం నాయకులు పేరం శ్రీనివాస్, మారం శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు. కొండపల్లి గ్రామంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో పూలే సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మోర్లే తిరుపతి, మాలీ సంఘ జిల్లా నాయకులు గుర్నులే సత్తయ్య, మాజీ ఎంపీటీసీ మోర్లే రఘుపతి, మాజీ సర్పంచ్ శాంతాపోశం, గ్రామ పటేల్, యువకులు పాల్గొన్నారు.



వాంకిడిలో..



కెరమెరిలో..



చింతలమానేపల్లిలో..

నిందితున్ని శిక్షించాలని మాలీ కులస్తుల ధర్నా



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే జెండాను అవమానపరిచిన ఘటనపై మాలీ కులస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం సభ్యులు పెద్ద ఎత్తున జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద నివాళులర్పించి అక్కడి నుంచి భారీ ర్యాలీగా తహసీల్ కార్యాలయానికి చేరుకుని, కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వారి జెండా అంటే మా ఆత్మగౌరవమని, ఈ ఘటనపై తక్షణమే చర్యలు తీసుకుని నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు ఈ ఘటనపై స్పందిస్తూ ఇది కేవలం ఒక వ్యక్తిపై చర్య కాదని, పూర్వాపరాలను దృష్టిలో పెట్టుకుని తగిన విధంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

వంద రోజుల పని కల్పించాలి



నవతెలంగాణ-వాంకిడి

జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలు అవసరం ఉన్న వారికి మంజూరు చేయాలన్నారు. రాజీవ్ యువవికాసం పైన గ్రామాల్లో అవగాహన కల్పించాలని, ఈ నెల 14తో దరఖాస్తు గడువు పూర్తవుతుందన్నారు. వేసవి నేపథ్యంలో నర్సరీలలో మొక్కలు పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఏపీఓ, ఈసీ పాల్గొన్నారు.

రజతోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ సభను పురస్కరించుకుని మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తల శుక్రవారం రజతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలంటూ ప్రజలను ఆహ్వానించారు. పార్టీ 25 ఏళ్ల ప్రయాణం ప్రజల ఆశయాలకు అద్దం పడిందని, ఉద్యమాల చరిత్ర కలిగిన వరంగల్ వేదికగా సభ జయప్రదంగా సాగాలన్నారు. హలో సిర్పూర్ ఛలో వరంగల్ అంటూ నినాదాలు చేస్తూ సభకు హాజరయ్యేలా పిలుపునిచ్చారు.

ఉద్యోగోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుళ్లగా విధులు నిర్వర్తిస్తూ హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి పొంది జిల్లాకు బదిలీ అయిన ఆరుగురు హెచ్‌సీలు శుక్రవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సిహెచ్ శ్రీనివాస్, బాలాజీ, సిహెచ్ సతీష్, ఎస్ సమ్మయ్య, రాజేందర్, సిహెచ్ సతీష్‌ను డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో పదోన్నతి ఎంతో ఉత్సాహాన్నిస్తుందని, దాంతోపాటు బాధ్యతను పెంచుతుందన్నారు.

నేడు బీఎస్ఎన్ఎల్ సేవా శిబిరం

నవతెలంగాణ- కాగజ్‌నగర్

పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా శనివారం బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డీఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ కనెక్షన్లు, సిమ్ కార్డులు, బిల్లులకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు తదితర వాటి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు వినియోగదారుల సేవామాసంగా నిర్ణయించడం జరిగిందని, వినియోగదారులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం సహాయ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు పాలనాధికారి(ఏసీఎల్‌బీ) దీపక్ తివారీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ స్కీమ్‌లో ఉన్న వివిధ యూనిట్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే వారు వివరాలను సరిగ్గా పూరించాలని, దరఖాస్తు ప్రతిని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తీరును, కులాల వారీగా ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను రిజిష్టర్‌లో ఎప్పటికప్పుడు రాయాలని, ఆఫ్‌లైన్‌లో ఇచ్చిన దరఖాస్తులకు ఆన్‌లైన్ అయ్యే విధంగా చూడాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. ఆదాయం సర్టిఫికేట్ అభ్యర్థులకు త్వరగా అందేలా తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రియాజ్ అలీకి సూచించారు. అనంతరం మండలంలో ఇప్పటివరకు ఎల్‌ఆర్‌ఎస్ వచ్చిన దరఖాస్తుల వివరాలను పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది ఎల్‌ఆర్‌ఎస్ చేసుకొనేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



ఆన్‌లైన్ దరఖాస్తు వివరాలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

'ఉపాధి హామీ' ఫొటో విధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్


నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఉపాధి హామీ పథకంలో ఫొటో విధానం రద్దు చేయాలని, దీంతో కార్మికులు మానసికంగా, శారీరకంగా వేధనపడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలం వేంపల్లి గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేసిన తర్వాత ఫొటో కోసం కార్మికులు మండుటెండలో గంటల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. మొబైల్ సిగ్నల్ లేని ప్రాంతాల్లో ఫొటోలు అప్‌లోడ్ చేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని, కొలతల పేరుతో కూలీలకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. అలాగే, పనులు ప్రారంభమైనప్పటి నుంచి బిల్లులు మంజూరుకాకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మీయ భరోసా కింద లబ్ధిదారులకు ప్రభుత్వం ఇప్పటికీ ఆర్థిక సహాయం అందించలేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే, ఉపాధి కూలీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఫొటో విధానం రద్దు చేసి, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆత్మీయ భరోసా సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ జారీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లా విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఒక జిల్లాలో విధులు నిర్వహించాల్సిందిపోయి మరో జిల్లాలో రెండు స్పాట్ వాల్యువేషన్ విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయురాలికి శుక్రవారం మంచిర్యాల జిల్లా విద్యాధికారి, మంచిర్యాల స్పాట్ వాల్యువేషన్ క్యాంప్ ఆఫీసర్ యాదయ్య షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఆర్డర్ ఒక చోట, విధులు మరో చోట అనే శీర్షికతో శుక్రవారం నవతెలంగాణలో వచ్చిన వార్తకు ఆయన స్పందించి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. మండలంలోని ఈజ్ గాం విలేజ్ నెంబర్ 3కు చెందిన ఓ ఉపాధ్యాయురాలికి సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంచిర్యాల జిల్లాకు 10వ తరగతి స్పాట్ వాల్యువేషన్ విధులు కేటాయించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడి నుంచి రిలీవింగ్ ఆర్డర్ తీసుకున్న ఉపాధ్యాయురాలు ఏకంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 10వ తరగతి స్పాట్ వాల్యువేషన్ విధులకు హాజరవుతున్నారు. దీనిని నవతెలంగాణ బట్టబయలు చేయడంతో ఎట్టకేలకు ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈఓ నోటీసులో పేర్కొన్నారు.



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER & CAMP OFFICER, SSC SPOT VALUATION CAMP APRIL-2025 MANCHERIAL
Present: Sri.S. Yadaiah, M.A., B.Ed.

Rc.No.B1/SSC Spot Valuation/2025 Dated: [illegible].04.2025

Show Cause Notice

Sub: School Education-SSC Spot Valuation- Smt. P. Savitha, SA (Maths) GHS Easgaon No.3, Mandal Kagaznagar, Kumarambheem Asifabad District- Violation of instructions of authorities-Show Cause Notice - Issued-Reg.

Ref: 1. DEO Mancherial Rc.No. A2/SSC Spot/2025, Dt: 02.04.2025.
2. HM GHS Easgaon No.3, Mandal Kagaznagar, Kumarambheem Asifabad District letter dt: 04.04.2025.

As per instructions issued in the reference 1st cited above, the Head Master, GHS Easgaon No.3, Mandal Kagaznagar, Kumarambheem Asifabad District has relieved vide reference 2nd cited above in respect of Smt. P. Savitha, SA (Maths) Govt. High School Easgaon No.3, Mandal Kagaznagar, Kumarambheem Asifabad District who is appointed as Assistant Examiner for evaluation of Maths papers at SSC spot valuation camp April-2025 at Carmel Convent High School, Mancherial with instructions to report before the Camp Officer, SSC Spot valuation camp, Mancherial on 07.04.2025 without fail.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-తిర్యాణి

పోలీసులు ఎప్పుడు ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తుంటారని రెబ్బెన సీఐ బుద్దే స్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమరం భీం చౌరస్తాలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పెరుమండ్ల వెంకటేష్ గౌడ్, మోకుదెబ్బ నాయకులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎస్ఐ నారాయణ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుళ్ళు శంకర్, శ్రీనివాస్, ఆటో డ్రైవర్ అధ్యక్షుడు మల్లేష్, డ్రైవర్లు జుంగోని లింగమూర్తి గౌడ్, చంద్రమౌళి, ఆదివాసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : ఆర్య వైశ్యుల సేవలు అభినందనీయమని డీఎస్పీ రామానుజం అన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్ చౌక్‌లో జిల్లా ఆర్యవైశ్యమహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వేసవిలో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చేవారి దాహార్తిని తీర్చేందుకు ఆర్యవైశ్యులు ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆర్. నాగేశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలువేరు సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాచకొండ గిరీష్, జిల్లా ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులు పుల్లూరు సతీష్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కేశెట్టి శంకరయ్య, టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్‌బీఐ మేనేజర్ సతీష్, వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు ఆనంతుల సురేష్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని రవీంద్ర నగర్-1 సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద మాజీ ఎంపీటీసీ చాప్లా రోజా సుధాకర్ ఆయన తల్లి స్వర్గీయ చాప్లే ఋషక్క జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఎస్సై ఇస్లావత్ నరేష్ ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ్, గ్రామస్తులు ఉన్నారు.

కన్నుల పండుగగా హనుమాన్ శోభాయాత్ర

నవతెలంగాణ ఆసిఫాబాద్

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు శిరీష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శిరిడి సాయి మందిరం వద్ద స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షులు కె.విశ్వప్రసాద్‌రావు పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. పట్టణ ప్రధాన వీధులగుండా శోభాయాత్ర కొనసాగి ఆలయానికి చేరుకుంది. జిల్లా నాయకురాలు మర్సుకోల సరస్వతి, మాజీ ఎంపీపీలు అరిగెల మల్లికార్జున్ యాదవ్, బాలేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు చిలివేరి వెంకన్న, భాజపా నాయకులు విశాల్, కోట వెంకన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, కమిటీ ప్రముఖులు రాధాకృష్ణ చారి, ఎకరాల శ్రీనివాస్, వి. మధు, డాక్టర్ రమేష్, ప్రకాష్ గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు. ఇదిలా ఉజిల్లా కేంద్రంలోని పలు హనుమాన్ ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జనకాపూర్ ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. మందిర అర్చకులు రామ్ చందర్ శర్మ, గురు స్వామి సుధాకర్, స్వాములు నరేష్, మహేష్, శేఖర్, రాజన్న, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు. బజార్‌వాడి ఆలయంలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేట ఇటిక్యాల-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్షం 2025- పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆహార పదార్థాలు, చిరు ధన్యాలు ఉపయోగించి అనుభంద ఆహారం తయారు చేసి 6 నెలల పిల్లలకు తల్లి పాలతో పాటు అదనపు ఆహార ప్రాముఖ్యత, ప్రసవానంతరం ముర్రుపాల ప్రాముఖ్యత 6 నెలల వరకు కేవలం తల్లి పాలు ఇవ్వడం ఆవశ్యకతపై అవగహన కల్పించారు. మొదటి 1000 రోజుల్లో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజార్ మమత, పల్లె దావఖాన డాక్టర్ మౌనిక, టీచర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీలో జై బాపు, జైభీం, జై సంవిధాన్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ, కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ సమావేశానికి హాజరై మాట్లాడారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్, రాజ్యాంగాన్ని గౌరవించుకుందామన్నారు. ఈ మూడు సూత్రాల మీద దేశం మొత్తం కార్యక్రమాలు జరుపుకుంటున్నామని, గ్రామాలలో గ్రామ మండల నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారాన్ని, పాదయాత్ర నిరహించాలని కాంగ్రెస్ సైనికులు, ప్రజలు సహకరించాలని పిలుపు నిచ్చారు.

ఫూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

బీసీల ముద్దుబిడ్డ, సమసమాజ స్థాపన కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని, అయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇటిక్యాలలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి భీమ్ దీక్ష దారుడు ఆకెనపల్లి శిల్పతి స్వామి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బియ్యాల తిరుపతి, బుద్దె తిరుపతి, పెట్టెం తిరుపతి, నిమ్మ రత్నాకర్, పెట్టెం స్వామి, కాంద్రపు ప్రసాద్, సప్ప రవి, పురుషోత్తం, కళ్యాణం రవి, నిమ్మ రవి, పెట్టెం కొమురయ్య, పోతు లక్ష్మణ్ పాల్గొన్నారు.

మంచిర్యాల : జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల అధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సత్య ప్రచారక్ సమాజ్ జిల్లా అధ్యక్షులు మేడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 11 ఏప్రిల్ 1827లో మహారాష్ట్రలోని సతర లో జన్మించిన పూలే తండ్రి గోవిందా రావు తల్లి చీమ్న బాయ్ తండ్రి పూల వ్యాపారం చేసుకుని బతికేవారని అందులో భాగంగానె పూలే అనే పేరు వచ్చిందని, దేశంలో బాలికల కొరకు మొట్టమొదటి పాఠశాలలు ఏర్పాటు చేసిన చరిత్ర జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే దంపతులకే చెందిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేష్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మౌల్కర్ ప్రేమ్ పాల్గొన్నారు.

జన్నారం : మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలోమండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిటీమల భరత్ కుమార్ పాల్గొన్నారు.

జైపూర్ : సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడైన జ్యోతిరావ్ గోవిందరావు పూలే బలహీణ వర్గాల వారి అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన ఘనుడని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (ఈడీ) చెన్నకేశువుల చిరంజీవి అన్నారు. మహాత్మా జ్యోతిరావుబా పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఎస్టీపీపీ పరిపాలన భవనంలో గల కాన్ఫరెన్స్ హాలులో జ్యోతిరావు పూలే చిత్రపటానికి అధికారులతో కలిసి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అదేవిదంగా చెన్నూర్ పట్టణంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్న నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకురాళ్లు బోగె నాగజ్యోతి, నాయకులు సత్యం, ముస్కె రమ, వడ్ల ఉమ, సమత, రాధ, వెంకటమ్మ దుర్గక్క, లక్ష్మి పాల్గొన్నారు.



జైపూర్ : చెన్నూర్‌లో జ్యోతిబా పూలే చిత్రటానికి నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు



మంచిర్యాల : సత్య ప్రచారక్ సమాజ్ అధ్వర్యంలో పూలేకు నివాళ్లు





మళ్లీ కట్టెల పొయ్యి పెట్టుకోవాల్సిందే



నవతెలంగాణ-జైపూర్

నిత్యావసర వస్తువులతో పాటు ఎప్పటికప్పుడు గ్యాస్ ధరలు పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ విధానలతో మళ్లీ కట్టెల పోయ్యే దిక్కయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయని చెన్నూర్ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో శుక్రవారం సీపీఐ(ఎం) నాయకులతో కలిసి వివిధ వార్డుల్లో నిరసన వ్యక్తం చేసిన మహిళలు, బాలికలపై దేశంలో కొనసాగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టి రక్షణ కల్పించలేని బీజేపీ ప్రభుత్వం తీరును ఎండగట్టారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఉపసంహరించుకోకుంటే బీజేపీ మోడీ ప్రభుత్వానికి మహిళలు తగిన గుణపాఠం చెప్పుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కమిటి సభ్యులు సామల ఉమారాణి, నాయకురాళ్లు నాగజ్యోతి, రమాదేవి, సరిత, సత్యం, మౌనిక పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-జైపూర్



నిషేధిత గుడుంబా తరిస్తున్న బానోత్ రాజేందర్‌ను శుక్రవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు స్థానిక ఎస్ఐ శ్వేత తెలిపారు. గుడుంబా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆర్కెపల్లి శివారులో నిఘా ఏర్పాటు చేసి నిందితున్ని పట్టుకోవడంతో పాటు అతని వద్ద నుంచి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడైన బానోత్ రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తున్న ప్రభుత్వం



నవతెలంగాణ-కాసిపేట

పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల గిరిజన ట్రైకర్ బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి లబ్దిదారుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని నిలదీయడానికి హైదరాబాద్‌కు బయలుదేరుతున్న సేవాలాల్ సేన నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తాజా మాజీ సర్పంచ్ అజ్మీర తిరుపతి నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జాదవ్ గజానంద్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మీర రాజేశ్ నాయక్లను హైదరాబాద్ వెళ్లకుండా ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అజ్మీర తిరుపతి నాయక్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి లబ్దిదారులకు న్యాయం చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గిరిజన సంఘాలు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు బాధ్యతగా పనిచేయాలి

● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



సీఐకి పలు సూచనలు చేస్తున్న రామగుండం సీపీ

నవతెలంగాణ-తాండూర్

శాంతి భద్రతల పరిరక్షణ కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం తాండూర్ సర్కిల్ పరిధిలోని మాదారం బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లను సందర్శించారు. సర్కిల్ పరిధిలోని గ్రామాలలో ఎలాంటి ఫిర్యాదులు నమోదవుతున్నాయి. కేసుల వివరాలను పోలీస్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలు ,అక్రమ ఇసుక రవాణా గంజాయి మాదకద్రవ్యాలు కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాలలో పోలీస్ శాఖపై నమ్మకం కలిగేల మారుమూల గ్రామాల ప్రజలతో మమేకం కావాలని చెప్పారు. గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బహిరంగ మద్యపానం పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండ చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు కలిగే లోతట్టు ప్రాంతాల వివరాలను సేకరించాలని తెలిపారు. వాగులు చెరువులు ప్రాజెక్టులకు పరిసర ప్రాంతాల ప్రజల ఇబ్బందులు సహాయక పునరావాస చర్యల కోసం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ ఆఫ్జలుద్దిన్, తాండూర్ సీఐ కుమారస్వామి, బెల్లంపల్లి-2 టౌన్ ఎస్ఐ మహేందర్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పనికి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ప్రశాంతంగా విశాలంగా ఎంతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. ఆలయ ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కార్యదర్శులు ముజాఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, జిల్లా నాయకులు మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ మత్స్య శంకరయ్య, మచ్చ పోషవ్వ, దాముఖ కరుణాకర్, చిందం చంద్రయ్య, శేషారావు, బండారి స్వామి, మామిడిపల్లి ఇంద్రయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-మంచిర్యాల



శృతి తల్లి దండ్రులతో మాట్లాడుఉన్న సీపీఐ(ఎం) నాయకులు

గత మూడు రోజుల క్రితం అత్తింటి వారి వరకట్న వేధింపులు తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడిన శృతి చావుకు కారణమైన భర్త, అత్త, మామలను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) నాయకులూ డిమాండ్ చేశారు. శుక్రవారం హాజీపూర్ మండలంలోని టికన్నపల్లిలో శృతి తల్లి దండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శృతిని అత్తింటి వారె చంపేసి ఆత్మహత్యగా సృష్టించారని వారు ఆరోపించారు. జిల్లాలో గత కొన్ని రోజులుగా వరకట్న వేదింపులు, హత్యలు పెరుగుతున్న ప్రభుత్వ అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తికూడా చూడడం లేదని, అందులో భాగంగానే ఇటీవల కాలంలో వరుసగా మహిలలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. తరచు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. శృతి చావుకు కారణమైన భర్త, అత్త మామలను కటినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన సీపీఐ(ఎం) అధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుమస ప్రకాష్, దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, పాయిరాల రాములు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి దుబాయ్-శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కల్లెడ భూమన్న తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నివసిస్తున్న గల్ఫ్ కార్మికులకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమం, హక్కుల రక్షణ కోసం తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఏర్పడిందని అన్నారు. ఈ కార్యవర్గ సభ్యులు వివిధ ఎమిరేట్స్ స్థాయిలో కార్యకలాపాలను సమన్వయం చేస్తూ అవసరమైన సందర్భాల్లో కార్మికుల పక్షాన సాయం అందించే దిశగా కృషి చేస్తుందని అన్నారు. కమిటీ ఎంపిక కోర్ కమిటీ సభ్యులు అమరగోండ తిరుపతి, పెరుగుమల్లికార్జున్, పాలాజీ శ్రీనివాస్, రాజు గౌడ్ అధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా రాజుగౌడ్ ఎరుకల, ఉపాధ్యక్షుడు జునుగురి భానేష్, ఇన్‌చార్జి దుర్గం లచ్చన్న, దుబాయ్ కోఆర్డినేటర్ కూనరపూ రమేశ్, అబుధబి కోఆర్డినేటర్లు దాసరి ప్రేమ్ సాగర్, కొంద్రా చరణ్, షార్జా కోఆర్డినేటర్ బండారి అశోక్, అలైన్ కోఆర్డినేటర్ శివ, ఫుజైరా కోఆర్డినేటర్ లింగం అంజన్న, రాస్ ఆల్ ఖైమా కోఆర్డినేటర్ ఉప్పు మల్లేశం, అజ్మాన్ కోఆర్డినేటర్ మహ్మద్ అబ్దుల్లా, సత్వ కోఆర్డినేటర్ గట్ల చందు, బార్ దుబాయ్ కోఆర్డినేటర్ పిల్ల వేణి శ్రీనివాస్, జబల్ ఆలి కోఆర్డినేటర్ జక్కుల మల్లేష్, నీ ఎన్నుకున్నారు.

వేసవి కాలంలో పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి

● లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



వేసవికాలంలో తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని లక్షెట్టిపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అల్లం నరేందర్ తెలిపారు. వేసవికాలం కావడంతో ప్రస్తుతం పాఠశాలకు సెలవులు సమిపిస్తుండడంతో పిల్లలు గోదావరిలో, వ్యవసాయ బావుల్లో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి అవంచనియా సంఘటనలు జరగకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. అలాగే ఎండలో తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీడ పట్టున ఉండే ఆటలు ఆడుకునే విధంగా చూసుకోవాలన్నారు. వేసవి కాలంలో తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండల ప్రజలను కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో శనివారం ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కొండాపూర్ 33 కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

యువత రాజీవ్ యువ వికాస రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

రాజీవ్ యువ వికాసం ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుదారుల సేవా కేంద్రంలో శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ సందర్శించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మేనేజర్ రాజశేఖర్, మెప్మ టీఎంసీ శంకరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు లాప్‌టాప్ ప్రొజెక్టర్ వితరణ



నవతెలంగాణ-జన్నారం

ప్రాథమిక పాఠశాల కిష్టాపూర్‌లో దిక్సూచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికాలో నివాసం ఉంటున్న నోముల రంజిత్ పాఠశాలకు శుక్రవారం లాప్టాప్ ప్రొజెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికాలో విద్యార్థులకు స్టెమ్ అనగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్‌పై ఎక్కువ దృష్టి పెడతారన్నారు. అదే విధానాన్ని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అమెరికా నుంచి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తారనిచెప్పారు. విద్యార్థులు ట్రెడిషనల్ విద్యాతో పాటు టెక్నికల్ విద్యను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ పిల్లలకు చిన్న నాటి నుండి సైన్స్ పట్ల అవగాహన ఉండాలని మూడ నమ్మకాలాను నమ్మ కూడదని చెప్పారు. ప్రొజెక్టర్ లాప్టాప్ అందించిన దిక్సూచి ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామటెంకి శ్రీనివాస్, లక్ష్మయ్య, టీచర్‌లు స్వరుప, వనిత, గీతా, స్వరూప పాల్గొన్నారు.

రేపటి 4వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-జన్నారం

ఏప్రిల్ 13న బీపీ మండల్ యాదవ్ వర్ధంతి, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం 4వ ఆవిర్భావ దినోత్సవాన్ని యాదగిరి గుట్ట(యాదాద్రి)లోని లక్కీ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆవిర్భావ దినోత్సవానికి మంచిర్యాల జిల్లాలో ఉన్న అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, పజాప్రతినిధులు, హాజరై గొల్ల, కురుమల, గొర్రెల కాపరుల ప్రస్తుత స్థితిగతులు సహకార సంఘాల నిర్వహణ సంక్షేమం పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతెన్నులపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. 13న ఉదయం 10గంటలకు జండా విష్కరణ, వక్తల, అతిథుల సందేశాలు ఉంటాయన్నారు. అనంతరం జాతీయ మాంస పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలతో శాస్త్రీయ పద్ధతిలో గొర్రెల మేకల పెంపకంపై అవగాహన కార్యక్రమం వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సందవేని గంగాధర్ యాదవ్, కాశవేని విజయ్ యాదవ్, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యం చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో పద్మశాలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఎస్ఐ రాజవర్ధన్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, ఈ



సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మండల ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు, రాబోయే రోజుల్లో సంఘం తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్ కుమార్, ఈఓ రాహుల్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు శెట్టిపల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడు కందుల రమేష్, ప్రధాన కార్యదర్శి, అయ్యోరు శ్రీనివాస్, కోశాధికారి దోమల భాస్కర్ పాల్గొన్నారు.

యువత అభివృద్ధి బాటలో పయనించాలి

నవతెలంగాణ-జన్నారం

యువత ఉన్నత లక్ష్యాలతో అభివృద్ధి బాటలో పయనించాలని జన్నారం ఎస్ఐ రాజ వర్ధన్ అన్నారు. శుక్రవారం సోనాపూర్ తండాలో కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. గ్రామ యువతకు ఆయన వాలీబాల్ కిట్లను అందజేశారు. చదువు అభివృద్ధికి పునాది లాంటిదని, యువత చదువుపై దృష్టి సారించి అభివృద్ధి బాటలో నడవాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

డీటీఓను కలిసిన డిపో మేనేజర్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆర్టీసీ నిర్మల్ డిపోకు ఇటీవలే బదిలీపై వచ్చిన మేనేజర్ కె.పండరి శుక్రవారం ప్రాంతీయ రవాణా శాఖ అధికారి దుర్గాప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి ఈ నెల 6న భద్రాచలంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో వాడిన ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్లు ఐ.రాజశేఖర్, నవీన్‌కుమార్ ఉన్నారు.

సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారునికి సన్నబియ్యం అందించి పేదలను అభివృద్ధి పరచడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని డిసిసి అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. సోన్ మండల కేంద్రంలోని తోకల సుగుణ అశోక్ సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజనం చేశారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సన్న బియ్యం పంపిణీపై అభిప్రాయం తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియాన్ని పేదలకు అందించి వారికి కడుపునిండా భోజనం అందించి వారి కండ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి గడపగడపకు ఒక సంక్షేమ పథకం చేరి ప్రజల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు వేణిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, ఓడ్నాల రాజేశ్వర్, కుంట వేణుగోపాల్, అంబేకర్ ప్రసాద్, మొయినొద్దీన్, గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, గాజుల రవికుమార్, రాజనరసింహరెడ్డి, అబూద్, కాంతయ్య, గడ్డం నర్సారెడ్డి, స్వామి, అమృత్, లింగన్న పాల్గొన్నారు.

నకిలీ పట్టా బుక్కులు, పహాణీలు సృష్టించిన వారిపై కేసు నమోదు

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి శివారు సోమగూడెంలోని సర్వే నెంబర్ 2/2, 2/45, 2/49, 2/15కు సంబంధించి 10.18 ఎకరాల భూముల్లో నకిలీ పట్టాలు, పహాణీలు తయారు చేసి ఆక్రమంగా లబ్ధిపొందాలని చూసిన వారిపై కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కాసిపేట మండలంలోని లంబాడితండాకు చెందిన బానోతు ఈశ్వరి, అజ్మీర జమున, అజ్మీర రాజిలి, కున్సోత్ మోతీ అనే నలుగురు అక్రమంగా పట్టా బుక్కులు, మీ సేవ పహాణీలను సృష్టించి, సింగరేణి కేకే ఓసీలో భూమి పోయిందని, అక్రమంగా పరిహారం తీసుకొని లబ్ధిపొందేందుకు చూసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ చేయగా నకిలీ పట్టాలు, పహాణీలు సృష్టించినట్లు తేలడంతో నలుగురిపై ఆర్డీఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం మండలంలోని లక్కారం గ్రామపంచాయతీ గంగన్నపేట బూత్ నెంబర్ 86, 87లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొండరి రమేష్ మాట్లాడుతూ పార్టీ చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రజలే గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొల్లే భాగీరథ, బూత్ అధ్యక్షులు రాజేశ్వర్, హరీష్, జిల్లా నాయకులు శేషారావు రాథోడ్, బింగి వెంకటేష్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : బీజేపీ స్థాపన దివస్ సందర్భంగా పట్టణం ఇటిక్యాలలో పట్టణ అధ్యక్షుడు హరి గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీ ఛలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ఉన్న నాలిల శుభ్రం చేయక చెత్తాచెదారం వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మంచి నీరు రావడం లేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో స్థానిక ప్రజలు, తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా ఇప్పటికీ ఈ సమస్యపై ఎలాంటిస్పందన లేదని బీజేపీ నాయకులు అన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రమేష్ జైన్, నరేష్ జైన్, ముష్కం గంగన్న, తగరపు గంగన్న, రాజ గురువయ్య, బుద్దె సిద్ధార్థ, గొల్లపల్లి సమరసింహా, గోపతి తిరుపతి, గొల్ల రాజేందర్ పాల్గొన్నారు.

15న జైలు పాత సామాగ్రి వేలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా జైలులోని పాత సామాగ్రిని ఈనెల 15న వేలం వేస్తున్నట్టు జిల్లా జైలు పర్యావేక్షణాధికారి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15న ఉదయం 11 గంటలకు వేలం పాట ఉంటుందని, ఆసక్తి గల వారు రూ.5 వేలు ముందుస్తుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంపాట దక్కించుకోలేనివారికి రుసుము తిరిగి ఇవ్వబడుతుందన్నారు. ఇతర వివరాలకు సెల్ :9603348532, 9491350943ని సంప్రదించాలన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు 9959226002 ఈ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాసవి ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ శిబిరం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని వాసవి ఉన్నత పాఠశాలలో యోగ గురువు గోజా జనార్ధన్ ఆధ్వర్యంలో సుమారు 300 మందికి వారం రోజులపాటు సాయంత్రం గంటన్నర సేపు ఉచిత యోగా శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని శుక్రవారం వాసవి కళాశాల ప్రిన్సిపల్ రాజు, ముత్యంరెడ్డి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా యోగా గురువు గోజా జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలను దూరం చేయడానికి ప్రాణాయామము యోగ ఆసనాలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.

12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆదిలాబాద్ సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని, పూర్వ విద్యార్థుల సంఘ ప్రధాన కార్యదర్శి బూర ఉమాశంకర్ పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి ఆదిలాబాద్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు 1980 సంవత్సరము నుంచి 2024 వరకు చదివిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఒక ప్రకటనలో కోరారు.

వివక్షలేని సమాజ నిర్మాణానికి కృషి



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వివక్షలేని సమాజ నిర్మాణం కోసం జ్యోతిభాపూలే కృషి చేశారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మహాత్మా జ్యోతిభా పూలే జయంతిని పురస్కరించుకోని బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలోని పూలే విగ్రహానికి కలెక్టర్ రాజర్షిషాతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నినాదాలు చేశారు. మహిళ చదువుకు ఆయన చేసిన కృషి కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తిపు, అభివృద్ధి జరుగుతుందని పూలే దంపతులు భావించారన్నారు. దానికి అనుగుణంగానే సమాజంలో ప్రధాన భూమిక పోశించే మహిళలు చదువు కుంటే సమాజం ముందుకు సాగుతుందని, ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. చదువుతో సమాజన్ని చైతన్య పరచవచ్చని, వివక్షలేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను వినియోగించుకుంటూ అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పూలే దంపతులు ఆడ పిల్లల చదువు కోసం ఎనలేని కృషి చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం సత్యశోధక్ సమాజ్ పేరిట సొసైటి ఏర్పాటు చేసి హక్కుల కోసం పోరాటలు చేశారన్నారు. ప్రభుత్వాలు కూడా పూలే దంపతులను ఆదర్శంగా తీసుకుంటు అమ్మాయి చదువుకు పెద్ద పీఠ వేస్తు సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు. ఆడ పిల్లల చదువుకు తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరూ ప్రోత్సహం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బీసీ వెల్పర్ అధికారి రాజలింగు, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్రెడ్డి, బీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, మేకల అశోక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశ మందిరంలో..

మహాత్మా జ్యోతిభా పూలే ఆదర్శప్రాయుడని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్ ముఖ్య అతితులుగా హాజరయ్యారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను స్మరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి కళాకారులు జ్యోతిభా పూలేను కీర్తిస్తూ పాటలు పాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్కోచ్ అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే, బీసీ సంఘాల నాయకులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీల విద్య కోసం పాటుపడిన మహాత్మా జ్యోతిబా పూలే అందరికి ఆదర్శ ప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బీసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, దాసరి రమేష్, మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే, విజయ్ కుమార్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో...

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ రీజినల్ మేనేజర్ ఎస్.ప్రణీత్ జ్యోతిభా పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. మహాత్మా జ్యోతిబాపూలే సేవలను అందరిని వివరించారు. ఈ కార్యక్రమంలో పీఓ. జిబ్లా, ఏఓ శంకరయ్య, ఏం. ఎఫ్ రాజేందర్, అకౌంటెంట్ రమేష్, సూపరింటెండెంట్ శివదాస్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

మహాత్మా జ్యోతిభా పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొప్పుల రమేష్, బేర దేవన్న, మొట్టే కిరణ్ కుమార్, పాశం రాఘువేంద్ర, ముచ్చ రఘు, సింగరి అశోక్, మేదరి స్వామి, మలపతి సుభాష్, బోథ్ అధ్యక్షులు ఎలక రాజు, సురేందర్ సభ్యులు పాల్గొన్నారు.

పది స్పాట్ కేంద్రం వద్ద...

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను పదో తరగతి మూల్యంకనం కేంద్రంలో టీటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీనికి డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిభా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్రం కంటే ముందు దేశంలో ఉన్న వర్ణ వ్యవస్థ ద్వారా ఏర్పడిన కులవర్ణ సంకెళ్లను తన ఉక్కు పాదాల కింద నలిపి సమ సమాజ నిర్మాణం కోసం పాఠశాలలను నెలకొల్పి సొంత భార్యకు చదువు చెప్పిన మహోన్నతమైన సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని అన్నారు. కార్యక్రమంలో టీటీయూ జిల్లా అధ్యక్షులు సోగల సుదర్శన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కంది శ్రీనివాసరెడ్డి, ఆదిలాబాద్ అర్బన్ ఏంఈఓ సోమయ్య, వీరేందర్, అరుగుల స్వామి, రవీందర్ రౌత్, గోవర్ధన్, బి. రవీందర్, ఏంఈఓ మావల సరోజ, జలంధర్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

మహాత్మా పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో సామాజిక సమానత్వం కోసం, విద్యావ్యాప్తి కోసం, సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం జీవితాంతం కృషి చేసిన మహాత్మా పూలే దంపతులకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు సందూరి వినయ్ సాగర్, బడుగు గంగయ్య నిట్యాడి నగేష్, దోమకొండ సుధాకర్, సంకే రమేష్, కనగండ్ల హేమలత, రమ్య, అలేఖ్య, నక్క భూమన్న, దావుల భువనేశ్వర్ ఉన్నారు.

అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో...

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ స్టడీ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అల్లూరి భూమన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దర్శనాల నాగేష్, నిమ్మల ప్రశాంత్, నాయకులు బత్తుల విశ్వంబర్, చందాల రాజన్న, ఐల మల్లయ్య, పరమేశ్వర్, ప్రభాకర్, రత్నపురి రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...


పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, గుడిపల్లి నగేష్ అన్నారు. శుక్రవారం జ్యోతిభా పూలే జయంతిని పురస్కరించుకొని, పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామ్ కుమార్, బూర్ల శంకరయ్య, రాజేశ్వర్, పోశెట్టి, శ్రీరాం, రమేష్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో...

గాదిగూడ మండల కేంద్రంలో శుక్రవారం ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిభా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్పీఆర్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడారు. మహాత్ముని ఆశయాలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కడదారపు ఆశన్న పాల్గొన్నారు.

తలమడుగు : మహాత్మా జ్యోతిభాపూలే జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో జ్యోతిభాపూలే సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. మండలంలోని కుచులాపూర్ గ్రామంలో పూలే దంపతుల విగ్రహాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల బీసీ నాయకుడు మేకల రవికాంత్, మాలీ మహా సంఘం నాయకులు రాములు, దీపక్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఆదర్శ దంపతులు తమ జీవితాలనే పేద వర్గాల ప్రజలకు అంకితం చేశారన్నారు. బ్రాహ్మణ ఆధిపత్య పోరుకు వ్యతిరేకంగా అందరు సమానమేనని సామాజిక న్యాయం కోసం కృషి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, గ్రామస్తులు దీపక్, వామన్, జనార్ధన్, పుండలిక్, మందాడి జనార్ధన్, లచ్చన్న, రాజేశ్వర్, కిషన్, గ్రామ మాలీ మహా సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనథ్ : మండలంలోని అడ గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిభాపూలే జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే దంపతులు సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాటం చేశారాని అన్నారు. బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా అందరు సమానమే అని సామాజిక న్యాయం కోసం కృషి చేశారని అన్నారు. మహారాష్ట్రలోని కడుగున్ గ్రామంలో పూలు అమ్ముకునే పేద కుటుంబంలో జన్మించారని అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వితంతు వివాహాలు చేసే దానికోసం ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా అనమానతలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఆత్రం కిష్టన్న, బొజ్జ ఆశన్న, శాఖ కార్యదర్శి ఆత్రం శ్యాంరావ్, జగన్, భీంరావు, స్వామి, రాము పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్

ఉట్నూర్ : అట్టడుగు వర్గాల్లోని ప్రజల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతులని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే దంపతుల చేసిన త్యాగం మరువలేనిదన్నారు. దేశంలో మొట్టమొదటిగా పాఠశాలలను నెలకొల్పి మహిళలకు విద్యను అందించారని తెలిపారు. సమాజ హితం కోసం వారు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. నేటి యువత పూలే దంపతులను ఆదర్శంగా తీసుకుని, వారి అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కడెం : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ భూమన్న హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, కాంగ్రెస్ మండల నాయకులు తాళ్లపెళ్లి రమేష్, శేఖర్, ధర్మయ్య, రాజు, రాజేశ్వర్, మల్లయ్య, చాంద్‌పాషా పాల్గొన్నారు.

ఖానాపూర్ : విద్యా వ్యాప్తి ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని ప్రగాఢంగా నమ్మి దానికోసమే తమ జీవితాన్ని ధారపోసిన మహాత్మా జ్యోతిబా పూలే జీవితం స్ఫూర్తిదాయకమని మస్కాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన జ్యోతిభా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన సమానత్వ సాధన కోసం ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో తాను అనుకున్న లక్ష్యం కోసం నిరంతరం పరితపించారని అన్నారు. చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో ముందుంటారని భావించి, ఇంట్లోనే తన భార్యకు చదువు నేర్పి, ఆమెతోనే అనేక మంది బాలికలకు చదువు చెప్పించిన గొప్ప మహనీయుడు జ్యోతిబాపులే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, తొంటి శంకర్, షేక్ ఇమ్రాన్, సయ్యద్ ఫరాజ్ అహ్మద్, శోభారాణి, కిషన్, ప్రసాద్, విజయ్ కుమార్, మహ్మద్ షఫీ, రవి, చందన, లక్ష్మణ్‌రావు, కడుకుంట్ల సాయికుమార్, పుప్పాల స్వప్న, గంగాధర్, రమేష్, సృజన, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నేరడిగొండ : మండలంలోని కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మహాత్మా జ్యోతిభా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆడే నూర్‌సింగ్, ఉపాధ్యాయులు వినోద్, రవీందర్, పంచాయతీ కార్యదర్శి రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : ఆర్టీసీ నిర్మల్ డిపోలో మహాత్మ జ్యోతిభా పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోమేనేజర్ కే.పండరి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిభా పూలే భారతీయ సామజిక కార్యకర్త, కులవ్యతిరేక పోరాటాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.



కడెం



తలమడుగు



జైనథ్ : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..



గాదిగూడ : ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో..